ప్రజాశక్తి
మంగళవారం 6 డిసెంబర్ 2022



తొలగింపు మెమో వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో పదేళ్లలోపు సర్వీసు కలిగిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించే ప్రక్రియ అన్యాయమని ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు జివి కిశోర్ పేర్కొన్నారు. వెంటనే తొలగింపు మెమోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మెమోను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. వారు పనిచేసే డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్‌లో ఏదైనా ప్రత్యేక కారణాలు ఉంటే, అందులో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మరొక శాఖలో సర్దుబాటు చేయాలన్నారు. అంతే తప్ప ఇలా తొలగించాలని మెమో ఇవ్వడం భావ్యం కాదని కోరినట్లు తెలిపారు.

ధాన్యం కొనాలని నిరసనలు



ధర్నాలో పాల్గొన్న వామపక్షాలు, జనసేన, రైతుసంఘాల నాయకులు, రైతులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలని కోరుతూ వామపక్షాలు, జనసేన పార్టీలతోపాటు రైతు సంఘాల ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఖరీఫ్ వరిపంట రైతు చేతికి వచ్చిందని, ధాన్యం ఎప్పుడు అమ్ముకుందామా అని గత 15-20 రోజుల నుండి రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు గ్రామాల్లో ధాన్యం కొనుగోలుపై ప్రచారం చేస్తున్నా ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ రైతులలో తెలియని ఆందోళన పెరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి తోడు వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను కంగారు పెడుతున్నాయన్నారు. మరోవైపు గ్రామాల్లోని దళారులు రైతులలో అనుమానాలను పెంచుతున్నారని చెప్పారు. ఇంకా గోనెసంచులు పది శాతం కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. రైస్ మిల్లర్లు కాలయాపన చేస్తున్నారని తెలిపారు. పండగ దగ్గర పడుతున్న కొద్దీ రైతులు విసిగి వేసారి, ప్రభుత్వ మద్దతు ధరను పక్కనపెట్టి మిల్లర్ల దోపిడీకి గురయ్యే పరిస్థితి వస్తుందన్నారు. జిల్లాలో ఉన్న సుమారు 90 మిల్లుల నుండి తక్షణమే బిజీలు సేకరించాలని డిమాండ్ చేశారు. సత్వరం ధాన్యం కొనుగోలు చేయాలని, లేకపోతే రైతులు దళారుల దోపిడీకి గురి కావాల్సి వస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే మిగిలిన మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ చెల్లిస్తారని, మిల్లులన్నీ తెరవడంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవని తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం చర్యలు తీసుకుంటున్నామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ నాయకులు బుడితి అప్పలనాయుడు, జీవ, జనసేన నాయకులు వి.దాలి నాయుడు, రైతుసంఘం నాయకులు బంటు దాసు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

బలిజిపేట : రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన సోమవారం బలిజిపేటలో నిరసన చేపట్టారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయంలో రమణరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు జి.బలరాంనాయుడు మాట్లాడుతూ మండలంలో అక్టోబర్ నెల మూడో వారం నుంచి వరి కోతలు మొదలయ్యాయని తెలిపారు. నాటి నుండి రైతులు ధాన్యాన్ని ఇంట్లో నిల్వ చేసుకుంటున్నారని చెప్పారు. కొంతమంది రైతులు నిల్వ చేయడానికి స్థలాలు లేక దళారులకు నష్టానికి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడం దారుణమన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంజరాపు సత్యంనాయుడు, రైతుకూలీ సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు , తదితరులు పాల్గొన్నారు

సీతానగరం : రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, నాయకులు బి.అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహాశీల్దార్ ఎంవి రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం కళ్లాల్లో ఉన్నప్పటికీ గోను సంచులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందన్నారు పత్రికల్లో ప్రకటనలు తప్ప ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. తక్షణమే ప్రతి రైతుకు గోనె సంచులు అందించాలని, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చెరకు రైతులకు కాటాలను ఏర్పాటు చేసి నేరుగా సేకరించి, తరలించాలని కోరారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, సింహాచలం, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు హాజరైన ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు



విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్

ప్రజాశక్తి-కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పిలుపునిచ్చారు. పార్వతీపురం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ నిర్వహించారు. డి.పండు, గంగారాం, చిన్నారి, వరుణ్ అధ్యక్ష వర్గంగా వ్యవమరించారు. తొలుత ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యాభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. జిడిపిలో విద్యారంగానికి కేవలం రెండు శాతమే నిధులు కేటాయిస్తే విద్యాభివృద్ధి ఏ విధంగా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేశామని గొప్పలు చెప్పుకోవడానికి పరిమితమైందన్నారు. కానీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు. అమ్మఒడి పథకం ద్వారా ఎంతోమంది లబ్ధి పొందుతున్నారని చెప్తున్నారని, అలాంటి పథకానికి ఆంక్షలు ఎందుకు పెడుతున్నారని నిలదీశారు. ఉన్నత చదువు చదవాలంటే విద్యార్థులు అన్నింటికీ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యం వేధింపులు తాళలేక చదువే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు సమస్యలు ఎక్కువ, సౌకర్యాలు తక్కువ అయ్యాయని తెలిపారు. ఎస్‌సి వసతిగృహాలకు దాదాపు 5 నెలల నుంచి మెస్‌ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నేటికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. జిల్లాలో చేపడతామన్న గిరిజన విశ్వవిద్యాలయం చోటెక్కడని ప్రశ్నించారు. ఈ మహాసభలో డివైఎఫ్ఐ, గిరిజన సంఘం, సిఐటియు, శ్రామిక మహిళా సంఘం నాయకులు ఎం.వెంకటరమణ, ఎం.శ్రీను, ఎం.మన్మథరావు, వి.ఇందిర తమ సందేశం అందించారు. మహాసభలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, సహాయ కార్యదర్శి రాజు, నాయకులు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్

అప్పులతోనే అభివృద్ధి, పథకాలు

ప్రభుత్వమంటే ప్రయివేటు కంపెనీ కాదు : ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అప్పులతో ప్రభుత్వం చేపడుతోందని ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్ అన్నారు. సోమవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని ప్రతిపక్ష పార్టీలు, కొన్ని మీడియా సంస్థలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. అప్పుల్లేని రాష్ట్ర ప్రభుత్వం, దేశాలు ఎక్కడైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఎపి కంటే ఎక్కువ అప్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ఉన్నాయని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. 1.76 లక్షల కోట్ల రూపాయలను నేరుగా పేదల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం వైసిపియేనని చెప్పారు.

ప్రభుత్వమంటే ప్రయివేటు కంపెనీ కాదన్నారు. అప్పులు చేస్తూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. ప్రజలను తప్పుదారి పట్టించడానికి టిడిపి, జనసేన దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ఈరోజు గందరగోళంలో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి చుట్టపు చూపుగా వచ్చి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి, జనసేన పార్టీలు జగన్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయబోమని చెప్పగలవా? అని సవాల్ చేశారు. ఒక వేళ అధికారంలోకి వస్తే అప్పులు చేయకుండా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఎం.సురేష్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్

దండికి పరామర్శ

మాతృవియోగంతో బాధపడుతున్న వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావును డిప్యూటీ సిఎం రాజన్నదొర, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ పరామర్శించారు. దండి శ్రీనివాసరావు తల్లి సింహాచలమ్మ ఆదివారం కన్నుమూసిన విషయం తెలిసిందే. దండి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్పందనకు 115 దరఖాస్తులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 115 వినతులు అందాయి. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ జిల్లా అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వినతుల్లో కొన్ని..

పార్వతీపురం పట్టణంలోని 16వ వార్డుకు చెందిన టి.జగదీశ్వరి ఇల్లు పట్టా మంజూరు చేశారని, ఇంత వరకు ఆ స్థలం ఎక్కడుందో చూపించలేదని వినతి పత్రం సమర్పించారు.

భామిని మండలం బత్తిలి గ్రామకంతం కింద ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా మార్చారని, తిరిగి గ్రామకంతంగా నమోదు చేయాలని ఎ.సూర్యనారాయణమూర్తి, గ్రామస్తులు కోరారు.

కురుపాం ఏకలవ్య బాలికల పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, డైనింగ్ హాల్ షెడ్ మంజూరు చేయాలని ఎపి గిరిజన సమాఖ్య సభ్యులు డి.సీతారాం అర్జీ అందజేశారు.

పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన ఈదుబిల్లి సుమతి తనకు మూడు సంవత్సరాల నుంచి రైతు భరోసా, పిఎం కిసాన్ నిధులు రావడం లేదని దరఖాస్తు అందజేశారు.

బలిజిపేట మండలం అంపావిల్లి గ్రామానికి చెందిన సిహెచ్.వరలక్ష్మి డి-పట్టా భూమిని వేరే వారు ఆక్రమించారని, రీ సర్వే చేసి ఆ భూమిని తనకు ఇప్పించాలని విన్నవించారు.

మధ్యాహ్న భోజనకార్మికుల సమస్యలను పరిష్కరించాలని, యూనిఫాం, ఐడి కార్డులు ఇచ్చి, మెస్ ఛార్జీలు పెంచాలని జి.శాంత కుమారి, తులసి కోరారు.

వీరఘట్టం మండలం కొంచ గ్రామంలో జిరాయతీకి సంబంధించిన భూములు సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని బి.పురుషోత్తమరావు, గ్రామస్తులు కోరారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ దవళ భాస్కరరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, డిఇఒ ఎస్.డి.వి.రమణ, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, జిల్లా సరఫరా అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి, ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు, జిల్లా మలేరియా అధికారి కె. పైడిరాజు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న బంటు దాసు

పశువుల శాలను తొలగించాలని వినతి

అడ్డాపుశీల పంచాయతీ బంటువనివాస గ్రామంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న పశువుల శాలని తొలగించాలని ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. రోడ్డుకు అడ్డంగా ఓలేటి గౌరునాయుడు పశువులశాల ఏర్పాటు చేశారని, గ్రామ పెద్దలు ఎన్నిసార్లు తొలగించాలని చెప్పినా వినిపించుకోవడం లేదని వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని డిపిఒకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బంటు దాసు, సూర్యనారాయణ, మరిచర్ల సింహాచలం, గొంగాడ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

జలకళ అమలుచేయాలి

వైఎస్‌ఆర్ జలకళ పథకాన్ని అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఎపి రైతుసంఘం నాయకులు త్రినాథనాయుడు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటరావుకు వినతి అందించారు.

వైస్ ఎంపిపి షణ్ముఖరావు మృతి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

జియ్యమ్మవలస వైస్ ఎంపిపి ముదిలి షణ్ముఖరావు (38) అకాల మరణం చెందారు. అనారోగ్యంతో విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. గడ్డ తిరువాడ ఎంపిటిసిగా వైసిపి నుంచి పోటీ చేసి షణ్ముఖరావు విజయం సాధించారు. ఆయనకు భార్య కుమారి, కుమారుడు ఉమామహేశ్వరరావు, కుమార్తె జాహ్నవి ఉన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికి అత్యంత సన్నిహితంగా ఉంటూ వైసిపిలో కీలకంగా మారారు.



షణ్ముఖరావు (ఫైల్)

పలువురి సంతాపం

వైస్ ఎంపిపి షణ్ముఖరావు మృతి పట్ల ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షణ్ముఖరావు మృతి పార్టీకి తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అన్ని విధాలా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. షణ్ముఖరావు మృతి పట్ల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

పాఠశాలలు మూతపడకుండా చూడాలి

డిప్యూటీ డిఇఒ విజయకుమారి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎక్కడా పాఠశాలలు మూతపడకుండా చూసుకోవాలని ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు మూతపడకుండా ఉండేందుకు అక్కడ వేరే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని ఎంఇఒలకు సూచించారు. పాఠశాల నిర్వహణ కూడా సక్రమంగా ఉండాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళిక వేసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ, వీరఘట్టం ఎంఇఒలు మీసాల సూర్యనారాయణ, పర్రి కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు, జి.రవిప్రసాద్, సిహెచ్ రత్నాకర్, ఎస్.శ్రీధర్, డి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ విజయకుమారి

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం

టిడిపి ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-సాలూరు

వైసిపి పాలనలో బిసిలకు చేసిందేమీ లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌తో కలిసి తహాశీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిలను రాష్ట్ర ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని విమర్శించారు. 56 బిసి కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, ఒక్క రూపాయి విడుదల చేయలేదని చెప్పారు. చైర్మన్, డైరెక్టర్ పదవులిచ్చి ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు, మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్ ఇతరులు పాల్గొన్నారు.

సీతానగరం : టిడిపి మండల అధ్యక్షులు కె.తిరుపతిరావు, రౌతు వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యాన తహాశీల్దార్ ఎంబి రమణకు వినతిపత్రం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.హరిగోపాలరావు, బి.శ్రీనివాసరావు నాయుడు, బి.వెంకటనాయుడు, డి.సింహాచలం, గరికయ్య పాల్గొన్నారు

కురుపాం : బిసిల సమస్యలపై టిడిపి మండల కన్వీనర్ కె.వి.కొండయ్య ఆధ్వర్యంలో తహాశీల్దార్ ఆర్. రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జి.వి.రమణమూర్తి, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, టిడిపి నాయకులు కొత్తకోట విశ్వనాథం, కర్రి వాసురావు, టెక్కలి దుర్గారావు, కలిశెట్టి శ్రీనివాసరావు, బోటు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : టిడిపి అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్ల రాంబాబు, ఎం.సత్యంనాయుడు, గురాన శ్రీరామ్మూర్తి, జోగి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : తహాశీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ శివన్నారాయణకు వినతి సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, జి.రవికుమార్, నాయకుల బోను చంద్రమౌళి, జాగాన రవికుమార్, ధనుంజయ, రాజశేఖర, భాస్కర్, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, టి.వెంకటరావు, కోల మధు, కోరాడ నారాయణరావు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి అరకు పార్లమెంట్ బిసి సెల్ ప్రధానకార్యదర్శి ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్, ఎంపిటిసి సభ్యులు పల్లెడ ఉమామహేశ్వరరావు, పూసర్ల నర్సింగరావు, దండి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు.. మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్ర జనాభాలో 50 శాతంపైగా ఉన్న వెనుకబడిన తరగతులకు వైసిపి మూడున్నర ఏళ్ల పాలన కాలంలో తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. బిసిలకు న్యాయం చేయాలంటూ స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం తహాశీల్దార్ రాములమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంపటాపు భారతి, జానకి, సొంటేన రాజేష్, తారకేశ్వరరావు, కామేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : బిసిల సమస్యలపై స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రమణారావుకు సోమవారం టిడిపి అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి అప్పారావు ఆధ్వర్యాన వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మిర్తివలస సర్పంచ్ దూడి భాస్కరరావు, సీనియర్ నాయకులు ముకుంద కిశోర్, రామారావు, పైడిరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

బ్రిడ్జి నిర్మాణానికి రూ.44 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో అరసాడ, మురగడాం గ్రామాల మధ్య సువర్ణముఖి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.44 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎంపిడిఒ ఎ.భానుమూర్తి వెల్లడించారు. ఈ మేరకు సిఎం జగన్ నుంచి ఆదేశాలు కూడా జారీ అయినట్లు చెప్పారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంతెన నిర్మాణం పూర్తయితే మండల ప్రజలు జిల్లా కేంద్రానికి తక్కువ సమయంలో చేరుకోవచ్చని తెలిపారు. నారాయణపురం గ్రామ పరిధిలో ఉన్న వంతెన నిర్మాణ పనులు కొంతవరకు ఆటంకం కలిగినా వాటిని పూర్తిచేసేందుకు ఎమ్మెల్యే జోగారావు ప్రతిపాదన చేశారని చెప్పారు.

వాలంటీర్‌పై సబ్‌కలెక్టర్ కు ఫిర్యాదు

పాలకొండ : రేషన్ పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వాలంటీర్ గొర్ల సాయికుమార్‌పై చర్యలు తీసుకోవాలని పాలకొండ 13వ వార్డుకు చెందిన వికలాంగుడు దుప్పాడ రాంబాబు.. సోమవారం గ్రీవెన్స్‌లో సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్‌కు ఫిర్యాదుచేశాడు. వెంటనే ఆయన స్పందించి చర్యలకు ఆదేశించారు. దీంతో విఆర్ఒ బి.శ్రీనివాసరావు దగ్గరుండి వికలాంగుడు రాంబాబుకు రేషన్ ఇప్పించారు.

- నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్‌కు వినతిపత్రం అందించారు. ఆ సంఘం అధ్యక్షులు బల్లి సుధాకర్ మాట్లాడుతూ తమకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

'గడపగడపకు'లో ఎమ్మెల్యే వి.కళావతి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. సోమవారం పాలకొండ మండలం వాటపాగు సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబానికి అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఇందుకు సంబంధించిన బుక్లెట్లను లబ్ధిదారులకు అందించారు. ఈ క్రమంలో గ్రామంలో తాగునీరు , రహదారులు, గృహ నిర్మాణాలు, కాలువలకు సంబంధించి సమస్యలను ప్రజలు విన్నవించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. ఆ సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అక్కడ నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులతో మమేకమై, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ప్రభుత్వ అందిస్తున్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని, అంగన్వాడీ పిల్లలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాలి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్ కుమార్, సర్పంచ్ వావిలపల్లి రాజారావు, ఎంపిటిసి వారాడ సరస్వతి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రణస్థలం రాంబాబు, సర్పంచులు గొర్లె కృష్ణారావు, కనుముల దాము, వైసిపి నాయకులు తాడేల జ్ఞానానందం, లంక అప్పలనాయుడు, మజ్జి జగన్నాథం, గోవిందరావు, మన్మధరావు, ఎంపిడిఒ డొంక త్రినాథులు, ఎఒ ఎ.వాహిని, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండరూరల్.. గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

పార్వతీపురం రూరల్ : సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. సోమవారం మండలంలోని ఎమ్మార్ నగరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, మత భేదాలు చూడకుండా పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఎక్కడా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంపిడిఒ ఆకిబ్ జావేద్, సర్పంచి వంగపండు లక్ష్మి, ఎంపిటిసి బడే రామారావు, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి-బొబ్బిలి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు ఆదివారం అర్ధరాత్రి సీజ్ చేశారు. బొబ్బిలి మండలం పిరిడి నుంచి చీపురుపల్లి లారీతో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అర్ధరాత్రి 2.30గంటల సమయంలో పిరిడి బస్‌స్టాప్ వద్ద విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు, కానిస్టేబుల్స్ జి.పురుషోత్తం, లక్ష్మీనారాయణ కలిసి దాడిచేసి పట్టుకుని సీజ్ చేశారు. లారీ డ్రైవర్ బోనెల సాంబయ్యను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను చిలకలపల్లి గ్రామానికి చెందిన బొడ్డు మోహనరావు వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నానని, ధాన్యం కోసం పిరిడి రాగ ధాన్యం లేకపోవడంతో పిరిడిలో ఉన్న బియ్యాన్ని చీపురుపల్లి తీసుకువెళ్లాలని లారీ యజమాని మోహనరావు చెప్పడంతో బియ్యం లోడ్ చేసి చీపురుపల్లి తీసుకుని వెళ్తున్నట్లు డ్రైవర్ సాంబయ్య చెప్పారు. లారీలో 10 టన్నుల 100కిలోల బియ్యం ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారణ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రేషన్ బియ్యం పిరిడి గ్రామానికి చెందిన కొల్లి సూర్యారావు దగ్గర లోడ్ చేసినట్లు గుర్తించి సూర్యారావుపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు చెప్పారు.

విజిలెన్స్ అధికారులను పక్కదారి పట్టించిన వ్యాపారులు

విజిలెన్స్ అధికారులను బియ్యం వ్యాపారులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ యజమాని బొడ్డు మోహనరావుకు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లిలో అయ్యప్ప మోడరన్ రైస్ మిల్లు ఉంది. రేషన్ బియ్యం వ్యాపారులు నుంచి రైస్ మిల్లు యజమాని కొనుగోలు చేసి బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేయడంతో చిలకలపల్లి తరలిస్తున్నట్లు చెప్పకుండా చీపురుపల్లి తరలిస్తున్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చి విజిలెన్స్ అధికారులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని చిలకలపల్లిలో ఉన్న అయ్యప్ప మోడరన్ రైస్ మిల్లులో ఫాలిష్ చేసి ప్యాకింగ్ చేసి అధిక ధరలకు బియ్యాన్ని అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యం తరలింపుపై సమగ్ర దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేసి రేషన్ బియ్యం తరలింపుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అరసాడలో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని అరసాడ పంచాయతీ పరిధిలో సోమవారం డ్రోన్ సర్వేను సర్పంచ్ పోల రామకృష్ణ, ఎంపిటిసి గుల్ల పోలిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ మండలంలో 34 గ్రామాలకు 24 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి అయిందన్నారు. ఫేజ్-3లో అరసాడ గ్రామంలో సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. 10 రోజుల్లో మిగిలి ఉన్న తొమ్మిది గ్రామాల్లో సర్వే పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్ నాయుడు, విఆర్ఒ నాగరాజు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో జిల్లా స్థాయి కళా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్స్‌పాల్ ఎన్. తిరుపతి నాయుడు ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే కళా ఉత్సవాలలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 44 పాఠశాల, కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొని పలు పలు అంశాల్లో పోటీ పడతారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పల్, ఉత్సవాల కో కన్వీనర్ కె. రామకృష్ణారావు, కో ఆర్డనేటర్లు పి. రవి కుమార్, కె. సూర్యా రావు, స్టాఫ్ సెక్రటరీ డి. ఈశ్వర రావు, సూపరింటెండెంట్ కమల కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

పనుకువలసలో పొలంబడి

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పనుకువలస ఆర్‌బికె వద్ద సోమవారం పొలంబడి కార్యక్రమాన్ని ఎఒ తిరుపతిరావు ఆధ్వర్యాన నిర్వహించారు. పురుగు మందుల విష ప్రభావాన్ని రైతులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ వినోద్ కుమార్, ఎపిసిఎంఎఫ్ ప్రతినిధులు యశోదమ్మ, బాలకృష్ణ, తిరుపతినాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానవ హక్కుల రక్షణకు ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మానవ హక్కుల రక్షణకు ఉద్యమం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపు నిచ్చారు. సోమవారం విజయనగరం సుందరయ్య కాలనీ లో. మానవ హక్కులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో రమణమ్మ మాట్లాడుతూ రోజూరోజుకు మానవ హక్కులు మృగ్య మైపోతున్నాయని, దళితులు,మహిళలపై రకరకాల రూపాల్లో దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. యోగా ముసుగులో బాబాలు, ప్రవచనాల ముసుగులో మహిళల్ని మభ్యపెట్టాలని చూసిన వారిపై ఈ ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. హింసకు వ్యతరేకంగా మహిళలు ఉద్య మించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు సుజాత, సత్యవతి , పద్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎయిడ్స్, టిబి నివారణపై శాక్స్ ఆధ్వర్యంలో బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ప్రభాకర్‌రావు, ప్రిన్సిపల్ జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టొంపలపాడులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో టొంపలపాడు గ్రామంలో నీలకంఠాపురం పిహెచ్‌సి వైద్యులు పి. అభినవ కుమార్ సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మేజర్ పంచాయతీలో సోమవారం నుంచి పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు ఇఒ కె.చంద్రశేఖర్ తెలిపారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు. పంచాయతీలో ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.

27 కేసుల్లో ఘరానా దొంగ అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో 27 దొంగతనాలకు పాల్పడిన ఘరాన నేరస్థుడును అరెస్టు చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బలిజిపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన మామిడి తిరుపతిరావు ప్రస్తుతం విశాఖలోని శ్రీహరిపురం నివాసం ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై గతంలో 60 దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించాడు.తరువాత మళ్లీ రాష్ట్రంలోని పలుచోట్ల చోరీలకు పాల్పడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆయనను ప్రదీప్‌నగర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది జూలై, ఆగస్టులో విజయనగరంలో 8నేరాలకు పాల్పడగా, అతని వద్ద నుండి 20 తులాల బంగారు ఆభరణాలు, తొమ్మిదిన్నర కిలోల వెండి వస్తువులను, రూ. లక్ష నగదు, స్కూటీ రికవరీ చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

నేలను రక్షించుకోవాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రైతులు నేలను సారవంతం చేసుకుంటే అధిక దిగుబడి సాధించడానికి వీలుంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలను పరిరక్షిస్తే పర్యావరణాన్ని కాపాడడంతోపాటు సకాలంలో వర్షాలు కురుస్తాయని తెలిపారు. పంటల మార్పిడి విధానం పాటించాలని సూచించారు. అనంతరం జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు మాట్లాడుతూ రెండు మండలాల్లో ఏడాది పొడవునా పంటలు పండించే రైతులు 800 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో అర ఎకరా విస్తీర్ణం దాటి 450 మంది రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ శివరామకృష్ణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిన్నారావు, జట్టు ట్రస్ట్ కోఆర్డినేటర్ నూకం నాయుడు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్ష

ప్రజాశక్తి-భామిని

భామిని ఆర్‌బికెలో ఎఒ కె.సింహాచలం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో అన్ని ప్రాంతాలలో వరికోతలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 12 కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు ఎఒ తెలిపారు. డేట్ ఎంట్రీ అంశాల్లో లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని తహశీల్దార్ అప్పారావు తెలిపారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఈ నెల 13, 14వ తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణ కోరారు. సోమవారం మున్సిపల్, రైస్ మిల్, ఆటో డ్రైవర్స్, తోపుడుబండ్ల కార్మికులతో కలిసి మహాసభ వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి రాయగడ రోడ్డు శివారు వరకు ప్రదర్శనను, అనంతరం మార్కెట్ యార్డు పక్కన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ సింహాచలం, గంగయ్యులు, శివ, సంతోష్, ఎం.శ్రీను, గంగరాజు, ఇప్పలమ్మ, లక్ష్మి, హరి, ఆనంద్, సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, శంభాన చిన్న, గుడుపూరు కృష్ణ పాల్గొన్నారు.

పాచిపెంట : సిఐటియు మండల కన్వీనర్ టి.ప్రభావతి ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభావతి, సిఐటియు నాయకులు చింత పోలిరాజు, కోరాడ ఈశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మంజుల మాట్లాడుతూ పార్వతీపురంలో ఈ నెల 13న జరిగే భారీ కార్మిక ర్యాలీకి తరలిరావాలని కోరారు.

గరుగుబిల్లి : మండల కేంద్రంలో సిఐటియు మహాసభల వాల్‌పోస్టర్‌ను సిఐటియు నాయకులు బి.వి.రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. జిల్లా మహాసభలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ దాసరి వెంకటనాయుడు, సామంతల అప్పడు, పాలక వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 45 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట



వినతులు స్వీకరిస్తున్న పిఒ నవ్య

సీతంపేట ఐటిడిఎ స్పందనకు 45 వినతులు వచ్చాయి ఐటిడిఎలో సోమవారం పిఒ బి.నవ్య ఆధ్వర్యంలో వినతులు స్వీకరించారు. మొగడపేట చెందిన నీలకంఠేశ్వరరావు రక్షణ గోడ మంజూరు చేయాలని వినతి సమర్పించారు. ఇప్పగూడ గ్రామానికి చెందిన తిరుపతిరావు నాటు కోళ్ల షెడ్ మంజూరు చేయాలని విన్నవించారు. నడిమిగూడకు చెందిన చిన్నారావు వాటర్ ట్యాంకు మంజూరు చేయాలని కోరారు. గూనభద్రకు చెందిన రాము ఆటో రుణం మంజూరు చేయాలని కోరారు. మాసగూడకు చెందిన దుర్గారావు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలపై రుణం ఇప్పించాలని కోరారు. టిటికీపాయికి చెందిన శ్యామలరావు అంగన్వాడి భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. తుంగతంపరకు చెందిన బాలరాజు మినీ ట్రాక్టర్ లోన్ ఇప్పించాలని కోరారు. లోకొండకు చెందిన శాంతమ్మ ప్రతి ఇంటికీ కుళాయి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, ఎటిడబ్ల్యు మంగ వేణి, సిడిపిఒ రంగ లక్ష్మి, ఎఇ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో బ్యాంకు పెట్టాలని నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

కురుపాం మండలం నీలకంఠాపురంలో ప్రభుత్వ బ్యాంకు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నీలకంఠాపురంలో బ్యాంకు పెట్టాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ నీలకంఠాపురం ప్రాంతంలో 9 పంచాయతీల పరిధిలో సుమారు పదివేల బ్యాంకు అకౌంట్లు ఉన్నాయని తెలిపారు. గతంలో నీలకంఠాపురంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ నడిపేవారని, అది పూర్తిగా ఎత్తివేయడంతో నిత్యం ఆ ప్రాంతం నుంచి వందల మంది గిరిజనులు బ్యాంకు లావాదేవీల కోసం ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న అమ్మఒడి, విద్యా దీవెన, రైతు భరోసా పథకాలు లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలు ఎంతో శ్రమపడి 100 కిలోమీటర్ల దూరంలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం వరకు ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. గిరిజనులకు ఎంతో ఉపయోగపడే బ్యాంకును ఎత్తివేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు నీలకంఠాపురంలో బ్యాంకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లు గంగు నాయుడు, సిపిఎం జిల్లా నాయకులు బంటు దాసు, కొల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన

ప్రజాశక్తి-బలిజిపేట



బలిజిపేట.. ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా సోమవారం తుమరాడ, వెంగాపురం, బర్లి రైతు భరోసా కేంద్రాలను తహశీల్దార్ విఐఎస్ శర్మ, ఎంపిడిఒ ఎ.భానుమూర్తి, ఎంఇఒ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కనీస మద్దతుధర పొందడానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం మిల్లులకు తరలించాలన్నారు. రైతు రవాణా సొంతంగా పెట్టుకుంటే వారికి రవాణా ఖర్చులు బ్యాంకు అకౌంట్‌లో జమచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు గ్రామంలో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఎఒ అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ధాన్యాలు కొనుగోలు సిద్ధంగా ఉన్నామన్నారు. సూరంపేట, నిడదవోలులో ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు.



వినతి అందిస్తున్న ఎన్‌వై నాయుడు, మధ్యాహ్న భోజన కార్మికులు

ఎండిఎం కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యాన భోజన కార్మికులు ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మెనూ ఛార్జి 20 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని కోరారు. పథకాన్ని ప్రయివేటీకరణ చేయొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు శ్రీలక్ష్మి, ఇతరులు పాల్గొన్నారు.

హెచ్‌సి కృష్ణమూర్తికి సన్మానం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న జిల్లా మెజిస్ట్రేట్ దామోదర్‌రావు

ఇంటర్నేషనల్ వాలంటీర్స్ డే సందర్భంగా సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న వృద్ధమిత్ర కోఆర్డినేటర్, హెడ్‌కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తిని రెడ్‌క్రాస్ సొసైటీ, ఐఆర్‌పిడబ్ల్యుఎ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా మెజిస్ట్రేట్ దామోదర్ రావు , సివిల్ జడ్జి రమేష్ , మున్సిపల్ మాజీ చైర్మన్ బి.జయప్రకాష్ నారాయణ, బి.ఎన్.బి రావు, ప్రకాశరావు, మంచిపల్లి శ్రీరాములు సమక్షంలో ఆయన చేసిన సేవలకు మెచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతరులకు సహాయం చేయడంలో కృష్ణమూర్తి ముందుంటారని, ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఉత్తమ సేవలకు సత్కారం

గుమ్మలక్ష్మీపురం : మండలంలో 35 ఏళ్లుగా జర్నలిస్టుగా, సామాజిక కార్యకర్తగా సేవలందిస్తున్న పైడా కొండలరావుకు ఇంటర్నేషనల్ వాలంటీర్స్ డే సందర్భంగా పార్వతీపురం ఎన్‌జిఒ ఫోరం సభ్యులు సత్కరించారు. జిల్లా జడ్జి ఎస్.దామోదర్ రావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ రమేష్ మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శి పి.నాగభూషణరావు, ఐఆర్‌పిడబ్ల్యు నిర్వాహకులు ప్రకాష్, ఆశాజ్యోతి డైరెక్టర్ జగదీష్ ఉన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి, తదితరులు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం


ప్రజాశక్తి - కురుపాం

సిఎం జగన్ చిత్రపటానికి ప్రభుత్వ వైన్‌షాప్ ఉద్యోగులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి శెట్టి పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మద్యం దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లకు రూ.3500, సేల్స్‌మేన్లకు రూ.4 వేలు చొప్పున వేతనం పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి నాయకులు షేక్ నూరేశ్, జి.రాజారావు, జి.వి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో అన్నదానం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అప్పయ్యపేటలో ఎంపిటిసి బురిడి కుసుమ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సుమారు 2000 మంది హాజరయ్యారు.



అన్నదానంలో పాల్గొన్న జనం

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని ఆర్ వెంకమ్మపేట, రామవరం మధ్య రైల్వే ట్రాక్ వద్ద సోమవారం ఉదయం రైలు ఢీకొనడంతో రైల్వేఉద్యోగి మరిశర్ల మోహన్(39) మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. రైల్వేలో కీమేన్‌గా పనిచేస్తున్న మోహన్‌ది మండలంలోని గుచ్చిమి గ్రామం. మోహన్ సోమవారం ఉదయం 5 గంటల సమయంలో విధులకు బయల్దేరాడు. విధులు నిర్వర్తించే సమయంలో మంచువల్లనో, లేదంటే ఏమి జరిగిందో కాని వెనుకనుండి వచ్చిన వచ్చిన రైలు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మోహన్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. మంచి వ్యక్తిని, ఆయన మృతిని జీర్ణించుకోలేక పోతున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, తోటిఉద్యోగులు తెలిపారు. ప్రమాదంపై కేసునమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ఇందిరా నగర్ కాలనీలో నివాసముంటున్న బాకీ మౌనిక (32) అనే వివాహిత ఆదివారం రాత్రి తన నివాసంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు... మౌనికకు బి.శివతోతో 2006లో వివాహమైంది. ఈమె భర్తను విడిచిపెట్టి గత ఏడాదిగా మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన భుజంగరావు అనే వ్యక్తితో కలిసి ఇందిరానగర్ కాలనీలో సహజీవనం చేస్తోంది. మౌనిక కుమార్తె ఆముదాలవలస కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 7వ తరగతి చదువుతుంది. కుమార్తెను చూసేందుకు యత్నించగా సహజీవనం చేస్తున్న భుజంగరావు అడ్డు చెప్పాడు. దీంతో ఆదివారం రాత్రి గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురై రాత్రి 11 గంటల సమయంలో ఆమె ఉరివేసుకొంది. బయట ఉన్న కుటుంబీకులు గుర్తించి ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో ఆమె మరణించింది. మందస మండలం రామాపురం గ్రామంలో నివాసం ఉంటున్న మృతురాలి తల్లి కీలు రత్నాలు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి. శివ ప్రసాద్ తెలిపారు. సోమవారం పాలకొండ ఏరియా ఆసుపత్రిలో మౌనిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల ఆరో తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకు సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.